## వచ్చే నెలలో అందుబాటులోకి రాజీవ్ పార్కు: మేయర్


రాజీవ్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 18: నగరంలోని మంకమ్మతోటలో గల రాజీవ్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులన్నింటిని వేగంగా పూర్తి చేసి వచ్చే నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. సోమవారం పార్కులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే రాజీవ్ పార్కులోనూ పచ్చదనం, వాకింగ్ ట్రాక్, కూర్చొవడానికి బేంచీలు తదితరాలను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మిగిలిన పనులన్నింటిని వచ్చే 15 రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే వీధి వ్యాపారుల కోసం యూనివర్సిటీ, ప్రభుత్వ దవాఖాన వద్ద షెడ్లు నిర్మాణం చేశామని, వాటిని కూడా అతి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్, వాల రమణారావు, నాయకులు కృష్ణగౌడ్, రాజేందర్, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పద్మనగర్ జంక్షన్ పనులు పరిశీలించిన కలెక్టర్

కార్పొరేషన్, నవంబర్ 18: కరీంనగర్‌లోని పద్మనగర్ చౌరస్తాలో ఐలాండ్ నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం పరిశీలించారు. ఐలాండ్ నిర్మాణం, సుందరీకరణ పనులపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్నద్ధం చేయాలి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

మానకొండూర్, నవంబర్ 18: వచ్చేనెల 4న నిర్వహించే జాతీయ సాధన సర్వే(ఎన్ఏఎస్) పరీక్షకు 6, 9 తరగతుల విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధంను చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా తరగతుల విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్షకు సంబంధించి నిర్వహించిన నమూనా పరీక్ష ఫలితాలను విశ్లేషించారు. ఎన్‌సీఈఆర్టీ ద్వారా పంపించిన ప్రశ్న పత్రాలను అభ్యాసం చేయించాలని సూచించారు. ప్రతి రోజు ఒక అభ్యసన ఫలితాన్ని విద్యార్థులు నేర్చుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి బోధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి కే అశోక్‌రెడ్డి, ఎంఈవో ఎం మధుసూదనాచారి, పాఠశాల హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యాంటీ బయోటిక్ మందులు ఇష్టారీతిగా వాడొద్దు


కరపత్రం విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

విద్యానగర్, నవంబర్ 18: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెంట్ కరపత్రాన్ని సోమవారం డీఎంహెచ్‌వో వెంకటరమణ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాంటీ బయోటిక్ మందులను క్వాలిఫైడ్ వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ ప్రకారమే పూర్తి కోర్సు వాడాలని సూచించారు. ఇష్టం వచ్చిన రీతిలో వాడితే దానికి సంబంధించిన బ్యాక్టీరియా యాంటీ బయోటిక్ పని చేయకుండా నిరోధకత పొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ, డాక్టర్లు ఉమశ్రీ, జవేరియా, తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డీఎంకు స్పందన


'డీవైడీఎం'లో మాట్లాడుతున్న డిపో-2 మేనేజర్ మల్లయ్య

తెలంగాణచౌక్, నవంబర్ 18: నగరంలోని బస్టాండ్ ఆవరణలో గల డిపో-2 కార్యాలయంలో సోమవారం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. కరీంనగర్ డిపో-2 పరిధిలో బెజ్జంకి, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు తెలుపడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. హైదరాబాద్ బస్సుల సంఖ్యపెంచాలని, గ్రామాల్లో పల్లె వెలుగు బస్సులు అదనంగా నడిపించాలని ప్రయాణికులు కోరినట్లు డిపో-2మేనేజర్ మల్లయ్య తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సేవలందిస్తున్నామన్నారు. డిపో-2 పరిధిలో సమస్యలు ఎదురైతే నేరుగా ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. అలాగే, శుభాకార్యాలు, విహారయాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గంజాయి కేసులో నిందితులకు ఐదేళ్ల జైలు

కోర్టుచౌరస్తా, నవంబర్ 18: గంజాయి కేసులో నలుగురు నిందితులకు సోమవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్ ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2020 నవంబర్ 10న ఉదయం 11 గంటల ప్రాంతంలో కరీంనగర్ టూ టౌన్ పోలీసులు నగరంలోని శివ టాకీస్ ప్రాంతంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు. అదే ప్రాంతంలో రోడ్డు పక్క ఎర్రోళ్ల రమేశ్, అన్నం కృష్ణ, జాడి అజయ్, దుర్గం శ్రీధర్, మడిశెట్టి రాజ్ కుమార్ ప్లాస్టిక్ సంచులతో అనుమానాస్పదంగా నిలబడి ఉన్నారు. పోలీసులు వారివద్ద ఉన్న ప్లాస్టిక్ సంచులు తనిఖీ చేయగా, వాటిలో నాలుగు కిలోల గంజాయి లభించింది. గంజాయి కలిగి ఉన్న ఐదుగురిపై కరీంనగర్ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. శరత్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి.. నలుగురు నిందితులు రమేశ్, కృష్ణ, శ్రీధర్, రాజ్ కుమార్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు విచారణలో ఉండగా అజయ్ అనే నిందితుడు మృతిచెందాడు.

## ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

రాంనగర్, నవంబర్ 18: నగరంలోని వావిలాలపల్లికి చెందిన ఓ వ్యక్తి మనోవేదనతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మకల్‌కు చెందిన ఆర్ష నిరంజన్ (50) వావిలాల పల్లెలో ఉంటూ నోటరీ అడ్వకేట్‌గా పని చేస్తున్నారు. గతేడాది నిరంజన్ పెద్ద కూతురు ప్రేమ వివాహం చేసుకొని ఇంటి నుంచి వెళ్లిపోగా మనోవేదనతో తాగుడుకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఇదివరకే రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశారు. ఆదివారం భార్య గ్రూపు- 3 పరీక్షలు రాసేందుకు వరంగల్ వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న నిరంజన్, ఆదివారం ఉదయం వెళ్లి రాత్రి తిరిగి వచ్చాడు. సోమవారం ఉదయం నిరంజన్ బయటికి రాకపోవడంతో ఇంటి యజమాని వెళ్లి చూడగా ముందు గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి తెలిపారు.

**ఊటూర్‌లో..**

మానకొండూర్ రూరల్, నవంబర్ 18: ఊటూర్ గ్రామానికి చెందిన పడాల శ్రీధర్ (37) సోమవారం గ్రామ శివారులోని వాగు ఒడ్డున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శ్రీధర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ప్రజావాణిలో వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- పరిశీలించాలంటూ అధికారులకు ఆదేశాలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 18 : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అనేక మంది దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఓపికతో వారి సమస్యలు విన్న కలెక్టర్ సంబంధిత అధికారులకు అర్జీలు అందజేసి, తక్షణమే పరిశీలించాలంటూ ఆదేశించారు. మొత్తం 180 దరఖాస్తులు రాగా, వీటిలో అత్యధికంగా 43 రెవెన్యూ శాఖ అధికారులపై వచ్చాయి.

### అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



నగరంలోని 53వ డివిజన్ పరిధిలో గల కశ్మీర్‌గడ్డ ప్రాంతంలోని గోదాం రోడ్డులో ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని, ఓ ప్రభుత్వ ఉద్యోగి ఫంక్షన్ హాలు నిర్మాణం చేస్తున్నడు. ఇళ్ల మధ్య నిర్మిస్తే చుట్టుపక్కల వారికి అనేక ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉంది. ఇప్పటికే అనుమతుల్లేకుండా ఓ ఫంక్షన్ హాలు నిర్మించిన ఆయన, ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి తప్పుడు అనుమతులతో కొత్తగా మరోటి నిర్మిస్తూ, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడు. స్థానికులనూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

*-సయ్యద్ కబీరుద్దిన్, కశ్మీర్‌గడ్డ, కరీంనగర్*

### మా భూమిని కాపాడండి



ధర్మారం గ్రామ శివారులోని సర్వే నం.465/ బి/4 2004లో మా తండ్రి కొనుగోలు చేసిన ఆరు గుంటల భూమిని ఏనుగు జయపాల్ రెడ్డి, కందికట్ల మధుసూదన్, వాసాల రామస్వామి, గూడెం రాజు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నరు. దీనిపై జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారికే టౌన్ ఎస్ఐతోపాటు కానిస్టేబుల్ సదయ్య వత్తాసుపలుకుతున్నారు. వారిపై మేమిచ్చిన ఫిర్యాదు ఉపసంహరించుకోవాలంటూ గత నెల 23న కానిస్టేబుల్ వచ్చి బెదిరించాడు. పోలీసులతో కుమ్మక్కైన కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడి కలెక్టర్ న్యాయం చేయాలి.

*-కాటిపల్లి రాజు, కాటిపల్లి సంధ్య, జమ్మికుంట*

### డంప్ యార్డు తొలగించాలి



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో 275, 277, 278 సర్వే నంబర్లలో ప్రభుత్వం మాకు నివేశన స్థలాలు ఇచ్చింది. ఆ స్థలాల్లో కొన్ని రోజుల నుంచి మున్సిపాలిటీ సిబ్బంది చెత్త తెచ్చి వేస్తున్నారు. మున్సిపాలిటీలో అడిగితే డంప్ యార్డు అక్కడే ఏర్పాటు చేసినమని చెబుతున్నరు. ఎలాంటి సౌలతులు లేకుంటేనే మేమక్కడ ఇండ్లు కట్టుకోలేదు. అక్కడ చెత్త తీసేసి, కరెంటు, నీళ్ల వసతి కల్పిస్తే ఇండ్లు కట్టుకుంటం.

*-నివేశన స్థలాల లబ్ధిదారులు, జమ్మికుంట*

## ఆలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి


ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 18: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బండారుపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, గ్రామాధ్యక్షుడు మార్క నర్సయ్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెన్నబోయిన రవి, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అద్దె షాపుల కేటాయింపు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 18: హుజూరాబాద్ ఆర్టీసీ బస్ డిపో పరిధిలోని పలు బస్టాండ్‌లలో ఖాళీగా ఉన్న అద్దె షాపులను నామినేషన్ పద్ధతిన రెండేళ్ల పాటు కేటాయించనున్నట్లు డిపో మేనేజర్ వీ రవీంద్ర నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ బస్టాండ్‌లో ఒక పక్కా స్టాల్, జమ్మికుంటలో ఓపెన్ స్టాళ్లు 3, ఉప్పల్ బస్టాండ్‌లో 3 పక్కా స్టాళ్లు ఖాళీ ఉండగా, ఆయా షాపుల్లో వ్యాపారం చేసుకునే ఆసక్తి డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు ఈనెల 22లోగా డిపో కార్యాలయంలో మధ్యాహ్నం ఒంటి గంటలోగా దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9959225924, 738285150, 9985379495 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## తల్లి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

మానకొండూర్ రూరల్, నవంబర్18: శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన బొడ్డు పోచమ్మ (85) ఆదివారం నిప్పంటుకొని చికిత్స పొందుతూ మృతిచెందగా, ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ సోమవారం ఆమె కూతురు అలువాల లచ్చమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## లారీ డ్రైవర్‌పై కేసు


చిగురుమామిడి, నవంబర్ 18 : చిగురుమామిడి గ్రామ శివారులో ఆదివారం రాత్రి హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న గ్రానైట్ లారీని (టీఎస్ 02 యు బి 7151) డ్రైవర్ అజాగ్రత్తగా నడుపగా రెండు గ్రానైట్ బండలు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

## ధర్మ జాగరణ రథయాత్ర ప్రారంభం


రథయాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఆలయ చైర్మన్ ఇప్పనపల్లి సాంబయ్య

చొప్పదండి, నవంబర్ 18: పట్టణంలోని మార్కండేయ ఆలయం వద్ద ధర్మ జాగరణ రథయాత్రను మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, ఆలయ చైర్మన్ ఇప్పనపల్లి సాంబయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లో రథయాత్ర కొనసాగుతుందని, ప్రజలు స్వాగతం పలుకాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దండే రాజయ్య, హనుమాన్ భజనమండలి సభ్యుడు చీకట్ల లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం


హుజూరాబాద్ ఏఎంసీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న టాప్రా సభ్యులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్18: హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్‌గా నియామకమైన బండారి సదానందంను సోమవారం తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టాప్రా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, హుజూరాబాద్ అధ్యక్షుడు చొల్లేటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దమ్మక్కపేటలో వృద్ధురాలు గల్లంతు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 18: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండబత్తిని రాజేశ్వరి (65) సోమవారం తెల్లవారుజామున గల్లంతు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దమ్మక్కపేటలోని ఓ వ్యవసాయ బావి వద్ద స్థానికులకు రాజేశ్వరి చెప్పులు కనిపించగా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫైరింజన్, మోటర్ల సహాయంతో నీటిని తోడారు. గజఈతగాళ్ల సాయంతో బావిలో గాలించినా ఫలితం లేకపోయింది.

## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు: ఎమ్మెల్యే సత్యం


కురిక్యాల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, నవంబర్ 18 : రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని కురిక్యాల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకంలో కోత విధిస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, నిబంధనల మేరకు తూకం వేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు భైరిశెటి సంపత్, ముత్యం శంకర్ తదితరులు ఉన్నారు.

## లాంచీ సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

గన్నేరువరం, నవంబర్ 18: మానేరు డ్యామ్‌లో కరీంనగర్ నుంచి మండలంలోని మైలారం వరకు లాంచీ సదుపాయం కల్పించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. లాంచీ సదుపాయం కల్పిస్తే మండల ప్రజలకు ప్రయాణ దూరం తగ్గుతుందని, అలాగే గన్నేరువరం మండలం ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్/కొత్తపల్లి, నవంబర్ 18: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థినులు అక్షిత, శరణ్య, తేజస్విని, మహిత ఇటీవల సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తైక్వాండో విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించారు. అలాగే, వారు డిసెంబర్20 నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ పమేలా సత్పతి తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థినులకు సూచించారు. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి పీడీ లెంకల మహిపాల్ రెడ్డి, తైక్వాండో కోచ్ బుర్ర ప్రవీణ్, కుమార్, పీఈటీ రామకృష్ణ అభినందించారు.

## జాతీయస్థాయి హాకీ పోటీలకు చెల్పూర్ విద్యార్థి


హర్షిత్

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 18: హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదివే సూత్రాల హర్షిత్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 22 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని రోతక్‌లో జరిగే 68వ ఎస్జీఎఫ్ఐ అండర్ -17 బాలుర జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌లో రాష్ట్రం తరపున హర్షిత్ ఆడనున్నాడు. జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన హర్షిత్‌ను పాఠశాల హెచ్ఎం అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ చిరుత శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌పై అవగాహన

జమ్మికుంట, నవంబర్ 18: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై జమ్మికుంటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు మాట్లాడుతూ, మితిమీరిన యాంటీ బయోటిక్స్ వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. డీసీహెచ్ డా.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.శ్రీకాంత్‌రెడ్డి, డా.ప్రణీత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామలతో పాటు వావిలాల, ఇల్లందకుంట, చెల్పూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## రేకుర్తి భూ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, నవంబర్ 18 : రేకుర్తి గ్రామంలో దశాబ్దాలుగా నెలకొన్న భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కృషి యూత్ ప్రతినిధి బండారి చంద్రయ్య సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధరణిలో నిషేధిత జాబితాలో చేర్చి సామాన్యులను అధికారులు ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి విచారణ జరిపి భూసమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు.

## బస్తాకు 41 కేజీలు మాత్రమే తూకం వేయాలి


చెర్లభూత్కూర్‌లో ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

కరీంనగర్ రూరల్, నవంబర్ 18: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాకు 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం చెర్లభూత్కూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం బస్తాకు 42 కేజీల తూకంపై ఎస్‌డీవోకు ఫోన్ చేసి మాట్లాడారు. అన్ని సెంటర్లలో ధాన్యం 41 కేజీలు మాత్రమే తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సన్నధాన్యం కొనుగోలుపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, నాయకులతో పాటు సింగిల్ విండో సీఈవో రమేశ్ పాల్గొన్నారు.


## ఉపాధి అవకాశాల కల్పనకు పటేల్ యూత్ వెబ్ సైట్

తెలంగాణచౌక్, నవంబర్ 18: రాష్ట్రంలోని మున్నూరుకాపు యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పటేల్ యూత్ వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ తెలిపారు. నగరంలోని ప్రెస్ భవనంలో పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వెబ్‌సైట్ ద్వారా మున్నూరు కాపుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కులస్తులందరినీ సమన్వయ పరుస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కుల సంఘంలో లక్ష సభ్యత్వాలు చేయించాలనే లక్ష్యంతో పటేల్ యూత్ ఫోర్స్ పని చేయాలన్నారు. కార్యక్రమంలో యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పటేల్, బీసీ సంక్షేమ సంఘం జిలా కార్యదర్శి దొగ్గలీ శ్రీధర్‌పటేల్ పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, నవంబర్ 18: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలు పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు నరేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రజలందరికీ ఉపాధి కల్పించాలని, పేదలకు ఎకరం భూమితో పాటు గృహనిర్మాణం కోసం 200 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయలేని యెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు సదానందం, రవితేజ, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## ముదిరాజ్ మహాసభ పోస్టర్ విడుదల


మండల కేంద్రంలో పోస్టర్ విడుదల చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

శంకరపట్నం, నవంబర్ 18: మండల కేంద్రంలో సోమవారం ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ముదిరాజ్‌లే మత్స్యకారులు' నినాదంతో ఈ నెల 21న తెలంగాణ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించుకోనున్నట్లు ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు పొలవేని భిక్షపతి తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ యువత విభాగం అధ్యక్షుడు సురేశ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప, నియోజకవర్గ ఇన్‌చార్జి గూళ్ల రాజు, నాయకులు గూళ్ల పాపయ్య, గూళ్ల రమేశ్, ఎడ్ల శ్రీనివాస్, ఎడ్ల సదయ్య, పొలవేని భాగయ్య, గౌరవేణి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వేణుగోపాల స్వామి ఆలయ జీర్ణోద్ధరణ


ఆలయంలో జీర్ణోద్ధరణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు

శంకరపట్నం, నవంబర్ 18: కేశవపట్నం శ్రీవేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా జీర్ణోద్ధరణ కార్యక్రమం సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గాను ఇటీవల ఎండోమెంట్ విభాగం నుంచి రూ.50 లక్షల నిధులు విడుదల అయ్యాయి. కాగా, ధర్మపురి వేద పండితులు మధు శంకర శర్మ, మధు మహాదేవ శర్మ, కాకి రాఘవ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జీర్ణోద్ధరణ క్రతువు పూర్తి చేశారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులతో పాటు మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గుర్రం రామస్వామి, అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కోశాధికారి తనుకు ప్రభాకర్, దుద్దెనపల్లి హనుమాన్ ఆలయ అధ్యక్షుడు శంకరలింగం, రిటైర్డ్ ఈవో ప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

వీణవంక, నవంబర్ 18: వల్బాపూర్ గ్రామంలో సోమవారం హుజూరాబాద్ డిపో డీఎం రవీంద్రనాథ్ దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువనేత ఎట్టపు మహేశ్ యాదవ్ గ్రామంలోని 80 మంది దివ్యాంగులకు తన సొంత ఖర్చులతో పాసులను సమకూర్చగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగి తాళ్లపెల్లి శ్రీనివాస్, మారముల్ల కొమురయ్య, దొమ్మటి రాజమల్లు, కామిడి శ్రీపతిరెడ్డి, న్యాలి సంపత్, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

మానకొండూర్, నవంబర్ 18: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం కరీంనగర్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి తహసీల్దార్ రాజేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడిని జయించడానికి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం రామకృష్ణారెడ్డి, ఉజ్వలత తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితబంధు లబ్ధిదారుల ముందస్తు అరెస్ట్


వీణవంక పోలీసు స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న దళిత బంధు లబ్ధిదారు

జమ్మికుంట/ హుజూరాబాద్ టౌన్/ వీణవంక, నవంబర్ 18: వరంగల్, కరీంనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో దళితబంధు పథకం రెండు విడుత డబ్బులు అందని లబ్ధిదారులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌లలో ఉంచారు. జమ్మికుంటలో కొలుగూరి సురేశ్, మంద రాజేశ్, బంగారి ప్రశాంత్, కొలిపాక రక్షిత్, ఆరెపెల్లి సంపత్, పాతకాల సురేశ్, పాతకాల రమేశ్, తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్‌కు అకినపల్లి ప్రవీణ్, జూపాకకు చెందిన అంబాల సుధాకర్, వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీణవంక బస్టాండ్ కూడలి వద్ద గుమిగూడి ఉన్న దళితబంధు సాధన సమితి నాయకులు దాసారపు గౌరయ్య, పుల్లూరి సంపత్, దూడపాక రవి, గురకుంట్ల రాకేశ్, దాసారపు నాగరాజు, మహంకాళి రమేశ్, గాజుల కుమార్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.